స్వచ్ఛంద సంస్థలు ప్రజా సమస్యల పరిష్కార కేంద్రాలుగా నిలువాలి



ముషీరాబాద్‌లో స్వచ్ఛంద సేవా కార్యాలయాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే ముఠా గోపాల్, పర్వేజ్

ముషీరాబాద్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛంద సంస్థలు ప్రజాసమస్యల కేంద్రాలుగా నిలవాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. ఆదివారం ముషీరాబాద్‌లోని దాయర మార్కెట్ సమీపంలో బీఆర్ఎస్ ముషీరాబాద్ డివిజన్ మైనార్టీ కమిటీ అధ్యక్షుడు, సోషల్ వర్కర్ సయ్యద్ పర్వేజ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్వచ్ఛంద సేవా కార్యాలయాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... స్వచ్ఛంద సంస్థలు మానవత దృక్పథంతో పేదలకు మెరుగైన సేవలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర మాజీ కార్యదర్శి ఎడ్ల హరిబాబు యాదవ్, యువజన కమిటీ నగర నాయకుడు ముఠా జైసింహా, బీఆర్ఎస్ భోలక్‌పూర్ డివిజన్ అధ్యక్షుడు వై.శ్రీనివాస్‌రావు, పార్టీ సీనియర్ నాయకులు శివముదిరాజ్, దీన్‌దయాల్‌రెడ్డి, మహ్మద్‌అలీ, వాహిద్‌అలీ తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాల బోద్ ప్రిన్సిపాల్‌కు డాక్టరేట్



అనురాధకు డాక్టరేట్ పత్రాన్ని అందజేస్తున్న ఐఎస్ఆర్‌వో చైర్మన్ డాక్టర్ వి.నారాయణన్

ముషీరాబాద్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): ఆదర్శ పాఠశాల బోద్ ప్రధానోపాధ్యాయురాలుగా బాధ్యతలు నిర్వహిస్తున్న, రాంనగర్‌కు చెందిన ఎస్.అనురాధ డాక్టరేట్ పొందింది. ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి ఎకనామిక్స్‌లో పీహెచ్‌డీ పూర్తిచేసినందుకు ఆమెకు ఐఎస్ఆర్‌వో చైర్మన్ డాక్టర్ వి.నారాయణన్, వైస్ చాన్సులర్ ప్రొఫెసర్ కుమార్ అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమెను పాఠశాల ఉపాధ్యాయులు, బంధువులు ఘనంగా సన్మానించారు.

సీఎంఆర్‌ఎఫ్ రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ



నల్లకుంటకు చెందిన వై.శ్రీనివాస్‌కు సీఎంఆర్ఎఫ్ కింద రూ.1.70 లక్షల ఆర్థిక సహాయం మంజూరైంది. ఈ మేరకు కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి, నల్లకుంట కార్పొరేటర్ యాకర అమృతతో కలిసి ఆదివారం బాధితుడికి ఎల్ఓసీని అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సెంట్రల్ జిల్లా మాజీ అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతమ్‌రావు, బీజేపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం కన్వీనర్ ఏడెల్లి అజయ్‌కుమార్, అంబర్‌పేట నియోజకవర్గం కన్వీనర్ ఎం.శ్యామ్‌రాజ్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు. - నల్లకుంట, ఆంధ్రజ్యోతి

పేద విద్యార్థులకు వైష్ణవి ట్రస్ట్ సహకారం



వాడాల ఉదయశ్రీకి చెక్కును అందజేస్తున్న రమణారావు, దేవులపల్లి రంగారావు తదితరులు

నల్లకుంట, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): పేదవిద్యార్థులు ఉన్నత విద్యనభ్యసించడానికి శ్రీవైష్ణవి చారిటబుల్ ట్రస్ట్ సహకారం అందిస్తుందని ట్రస్ట్ అధ్యక్షుడు పోచంపల్లి రమణారావు పేర్కొన్నారు. ఆదివారం నల్లకుంటలోని వాడాల ఉదయశ్రీకి మాతృశ్రీ ఇంజనీరింగ్ కాలేజీలో ద్వితీయ సంవత్సరం చదువుకోవడానికి రూ.83వేల చెక్కును విద్యార్థిని తల్లి వాడాల కల్యాణికి పోచంపల్లి రమణారావు అందజేశారు. పేద విద్యార్థులకు తమ ట్రస్ట్ పక్షాన పూర్తి ఆర్థిక సహకారం అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ కోశాధికారి దేవులపల్లి రంగారావు, డి.అశోక్‌కుమార్, దేశ్‌ముఖ్, రమాకుమార్, లీలాబాయి పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



నల్లకుంట సిండికేట్ బ్యాంకు చౌరస్తాలోని సంస్థ కార్యాలయంలో ఆదివారం నల్లకుంట ప్రభుత్వ పాఠశాల 1976 పదో తరగతి పూర్వవిద్యార్థుల సమ్మేళనం జరిగింది. ఈ సందర్భంగా గురుపౌర్ణమిని పురస్కరించుకుని ప్రముఖ సంగీత విద్వాంసుడు పోపూరి శ్రీనివాసశర్మను పలువురు సత్కారించారు. ఈ కార్యక్రమంలో పూర్వవిద్యార్థులు విశ్వమోహన్, జయపాల్‌రెడ్డి, విజయ్‌కుమార్, ఆర్‌కే. చార్యులు, షరీఫ్, గోపాల్, రమణ, వాసు, శ్రీనివాస్ పాల్గొన్నారు. - నల్లకుంట

మాలబస్తీలో హెచ్‌టీ బంచ్ కేబుల్ ఏర్పాటు

చిక్కడపల్లి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): గాంధీనగర్ డివిజన్‌లోని మాలబస్తీలో విద్యుత్ వైర్లతో ప్రమాదాలు జరగకుండా స్థానికుల విజ్ఞప్తి మేరకు విద్యుత్‌శాఖ అధికారులు ఆదివారం హెచ్‌టీ బంచ్ కేబుల్‌ను ఏర్పాటు చేశారు. బస్తీవాసులు ఇటీవల కార్పొరేటర్ ఎ.పావనివినయ్‌కుమార్‌కు చేసిన ఫిర్యాదు మేరకు ఆమె విద్యుత్‌శాఖ అధికారులకు సూచించారు. దీంతో డివిజన్ ఇంజనీర్ సంపత్, గాంధీనగర్ విద్యుత్ సెక్షన్ ఇన్‌చార్జి ఏఈ సంతోష్ పర్యవేక్షణలో ఆదివారం మాలబస్తీలో విద్యుత్ తీగలను తొలగించారు. తర్వాత హెచ్‌టీ బంచ్‌కేబుల్‌ను ఏర్పాటు చేశారు. కార్పొరేటర్ సూచనల మేరకు బీజేపీ నేతలు వినయ్‌కుమార్, మదన్‌మోహన్, గోపి, అరుణ్‌కుమార్, సాయి, రాహుల్, తేజ, హరిప్రసాద్‌లు విద్యుత్ శాఖ సిబ్బంది వెంట ఉండి, పనులు చేయించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ విద్యుత్ తీగల క్రమబద్ధీకరణ, చెట్ల కొమ్మలు తొలగింపు, వినాయకమండపాల ఏర్పాట్లలో ఎలాంటి సమస్యలూ తలెత్తినా కూడా కార్పొరేటర్ కార్యాలయం నెంబర్ 7799819991కు కాల్ చేయాలని కోరారు.

నేడు విజేతలకు బహుమతి ప్రదానం

చిక్కడపల్లి, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): నవ్యనాటక సమితి ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన ఏవీ సావిత్రి లలిత సంగీత పోటీల్లో విజేతలైన వారికి సోమవారం సాయంత్రం త్యాగరాయ గానసభలో బహుమతి ప్రదాన సభను నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ అధ్యక్షుడు వేమరాజు విజయకుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ పూర్వసలహాదారు డా.కేవీ.రమణాచారి ముఖ్యఅతిథిగా పాల్గొంటారని ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

జంతు శాస్త్ర మొదటి సెమిస్టర్ పుస్తకాల పంపిణీ

రాంనగర్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): నగరంలోని విద్యానగర్‌లో గల స్వామి వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జంతు శాస్త్ర అధ్యాపకుడు డాక్టర్ ఎల్.మహేష్ రచించిన జంతు శాస్త్ర మొదటి సెమిస్టర్ పాఠ్య పుస్తకాన్ని ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రభు ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఆవిష్కరించారు. తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ కళాశాలలకు ఈ పుస్తకాన్ని ఉచితంగా అందజేయాలని, లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ ఆపూర్వ ఆధ్వర్యంలో 150 పుస్తకాలను ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రభుకు లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ పూర్వ ప్రతినిధులు అందజేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ పూర్వ అధ్యక్షుడు సూర్యనారాయణ, పూర్వ కోశాధికారి నయనాదేవి, కార్యదర్శి మహేష్, జంతు శాస్త్ర అధినేత నీరజ, పద్మజ, డాక్టర్ భిక్షమయ్య, మంజులత, డాక్టర్ అనితారాణి, డాక్టర్ అనసూయ, విజయ, కల్యాణి, ప్రొఫెసర్ కె.ఆంజనేయులు, ప్రొఫెసర్ శ్రీనివాస్‌రావు, ప్రొఫెసర్ హరికిషన్, ఎస్.పూర్ణిమ తదితరులు పాల్గొన్నారు.

గణేశ్ నవరాత్రి ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలి

కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి



గోవింద్‌నగర్‌లోని అశోక ఫంక్షన్ హాల్‌లో జరిగిన సమావేశంలో ప్రసంగిస్తున్న కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

గోల్నాక, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): గణేశ్ నవరాత్రి ఉత్సవాలను శాంతియుతంగా భక్తి ప్రపత్తులతో ప్రశాంతమైన వాతావరణంలో జరుపుకుని, ఈ ఉత్సవాల ప్రతిష్టను మరింతగా పెంపొందించాలని కేంద్ర మంత్రి గంగాపురం కిషన్‌రెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి అంబర్‌పేట నియోజకవర్గం కన్వీనర్ అచ్చిని రమేష్ అధ్యక్షతన గోల్నాక డివిజన్ గోవింద్‌నగర్‌లోని అశోకా ఫంక్షన్ హాల్‌లో మండప నిర్వాహకుల సమావేశం శనివారం రాత్రి జరిగింది. ఈ సమావేశంలో కిషన్‌రెడ్డి మాట్లాడుతూ భాగ్యనగర్ గణేశ్ ఉత్సవాలకు ఎంతో ప్రతిష్ట ఉందన్నారు. ఈ ఉత్సవాలు రాష్ట్రానికే ఆదర్శంగా నిలుస్తాయని, అందుకే ఆధ్యాత్మిక వాతావరణంలో జరుపుకోవాలన్నారు. ఈసారి మండపాల్లో ఆపరేషన్ సిందూర్ ప్రాధాన్యం ఉండాలని నిర్వాహకులకు సూచించారు. భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి కూడా నిర్వాహకులకు ఎప్పటికప్పుడు మార్గనిర్దేశనం చేస్తూ ఉత్సవాలను ఘనంగా జరుపుకునేలా చూడాలన్నారు. పోలీసులు కూడా ఎలాంటి ఆటంకాలను నిర్వాహకులకు కల్పించకుండా, ప్రశాంతంగా ఉత్సవాలు జరిగేలా చూడాలన్నారు. ఈనెల 27 నుంచి నగరంలో జరిగే గణేశ్ నవరాత్రి ఉత్సవాలకు ప్రజలు కూడా సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో కాచిగూడ ఏసీపీ హరీష్, అంబర్‌పేట, కాచిగూడ ఇన్‌స్పెక్టర్లు కిరణ్‌కుమార్, జ్యోత్స్న, కార్పొరేటర్లు బి.పద్మావెంకటరెడ్డి, వై.అమృత, బీజేపీ సెంట్రల్ జిల్లా మాజీ అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతమ్‌రావు, భాగ్యనగర్ ఉత్సవ సమితి కార్యదర్శి ఆలే భాస్కర్, నాయిని బుచ్చిరెడ్డి, సికింద్రాబాద్ పార్లమెంటు నియోజకవర్గం కో-కన్వీనర్ గంధమల్ల ఆనంద్‌గౌడ్, వివిధ పార్టీల నాయకులు, ఉత్సవ సమితి నేతలు బి.వెంకటరెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, ఏడెల్లి అజయ్‌కుమార్, వనం రమేష్, మూల రవీందర్‌గౌడ్, సూదగాని శ్రీధర్‌గౌడ్, మైలారం రాజు, గోవింద్ అరుజున్, జి.మల్లేష్, కెంచె చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

గణేశ్ నవరాత్రి ఉత్సవాలకు జోరుగా ఏర్పాట్లు

గోల్నాక: గణేశ్ నవరాత్రి ఉత్సవాలకు అంబర్‌పేట నియోజకవర్గంలో అన్ని బస్తీల్లో, వాడల్లో, కాలనీల్లో, ప్రధాన రోడ్లపై నిర్వాహకులు జోరుగా మండపాలను ఏర్పాట్లు చేస్తున్నారు. ఈనెల 27నుంచి ఉత్సవాలు ప్రారంభం కానుండడంతో నియోజకవర్గంలోని గోల్నాక, అంబర్‌పేట, బాగ్‌అంబర్‌పేట, నల్లకుంట, కాచిగూడ డివిజన్లలో ఎక్కడ చూసినా గణేశ్ మండపాల ఏర్పాట్ల జోరు కన్పిస్తోంది. ఇప్పటికే పలు బస్తీలలో కొందరు నిర్వాహకులు వినాయక విగ్రహాలను సైతం తీసుకొచ్చారు. ఒక్కొక్క బస్తీలో రెండు, మూడు మండపాల చొప్పున ఏర్పాటు చేస్తున్నారు. వివిధ రకాల అలంకరణలతో భక్తులను ఆకట్టుకునేలా నిర్వాహకులు మండపాలను ఏర్పాటు చేస్తున్నారు. విద్యుత్ దీపాలతో బస్తీలను అలంకరిస్తున్నారు. ఒకవైపు నిర్వాహకులు ఉత్సవాలకు ఏర్పాట్లు చేస్తుండగా పోలీసులు శాంతియుతంగా ఉత్సవాలు జరిగేలా చర్యలు తీసుకుంటున్నారు. మండపాల నిర్వాహకులతో, నాయకులతో సమావేశాలను ఏర్పాటుచేసి, ఉత్సవాలు శాంతియుతంగా జరిగేలా సహకరించాలని సూచిస్తున్నారు.

మట్టి గణపతి విగ్రహాలనే పూజించాలి

రాంనగర్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): మట్టి గణపతి విగ్రహాలనే ప్రతిష్ఠించి, పూజించి, పర్యావరణ పరిరక్షణలో ప్రజలు భాగస్వామ్యం కావాలని వాకర్స్ క్లబ్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ గవర్నర్ లింగప్రకాష్ సూచించారు. ఆదివారం బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య పార్కులో హైదరాబాద్ సిటిజన్‌ఫోరం, సుందరయ్య పార్కు వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రజలకు ఉచితంగ మట్టి గణపతి విగ్రహాలను పంపిణీచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇళ్లల్లో, అపార్ట్‌మెంట్, కాలనీ, బస్తీల్లో మట్టిగణపతి విగ్రహాలను పూజించాలని సూచించారు. హైదరాబాద్ సిటిజన్ ఫోరం ప్రధానకార్యదర్శి కె.వీరయ్య మాట్లాడుతూ హైకోర్టు ఆదేశాల మేరకు మట్టి గణపతి విగ్రహాలను ప్రతిష్ఠించాలని, విగ్రహాల ఎత్తు 5 అడుగులకు మించకూడదన్నారు. ప్లాస్టర్ ఆఫ్ ప్యారీస్ విగ్రహాలను పెట్టొద్దని కోరారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ మాజీ అధ్యక్షుడు వి.నాగభూషణం, హెచ్ఎండీఏ డీఈ రంజిత్, సుందరయ్య పార్కు వాకర్స్ క్లబ్ ప్రధాన కార్యదర్శి మనోహర్‌రెడ్డి, కోశాధికారి దశరథ్, మాజీ అధ్యక్షుడు శైలజ, శంకర్‌రావు, రమేష్‌రెడ్డి, శ్రీనివాస్‌రావు, సంగీత, నాగేష్, సుకుమార్, సైదులు, రమేష్ పాల్గొన్నారు.

పూర్తిగా సహకరించాలి: బీజేపీ

బర్కత్‌పుర: గణేశ్ ఉత్సవాలు ప్రశాంతంగా జరిగేందుకు ప్రభుత్వం పూర్తిగా సహకరించాలని బీజేపీ సెంట్రల్ జిల్లా మాజీ అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతమ్‌రావు కోరారు. ఆదివారం బర్కత్‌పురలో బీజేపీ సెంట్రల్ జిల్లా కోశాధికారి ఎ.సూర్యప్రకాష్ సింగ్ ఆధ్వర్యంలో వినాయక చవతి సందర్భంగా 5 ఫీట్ల ఎత్తు గల 40 గణపతి విగ్రహాలను ప్రజలకు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినాయకఉత్సవాల సందర్భంగా ప్రమాదాలు జరగకుండా ప్రభుత్వం, పోలీసులు చర్యలు తీసుకోవాలన్నారు. రోడ్లకు తక్షణమే మరమ్మతులు చేయాలన్నారు. ఆంక్షల పేరిట ఉత్సవ సమితి నిర్వాహకులకు పోలీసులు ఇబ్బందులకు గురిచేస్తున్నారని, ఈ పద్ధతిని మానుకోవాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కన్నె ఉమాదేవి, బీజేపీ నాయకులు క్షీరసాగర్, బల్బీర్, సందీప్‌సాయి, సాయికుమార్, శ్రీకాంత్, సునీల్, సత్యేందర్ సింగ్, ఎ.ఆశీష్ పాల్గొన్నారు.

రాంనగర్: రాంనగర్‌లోని గణేశ్ నగర్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గణనాథుడి ఆగమనం కార్యక్రమాన్ని ఆదివారం రాత్రి రాంనగర్ చౌరస్తాలో ఘనంగా నిర్వహించారు. అసోసియేషన్ అధ్యక్షుడు నర్సింగ్ ముదిరాజ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా యూత్ కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి అరవింద్ కుమార్ యాదవ్ హాజరయ్యారు. ఈ వేడుకను చూసేందుకు జనం తరలొచ్చారు.



గోల్నాక డివిజన్ తిరుమలనగర్‌లో గణేశ్ నవరాత్రి ఉత్సవాలకు ఏర్పాటు చేస్తున్న మండపం



వినాయక విగ్రహాన్ని ఉచితంగా పంపిణీ చేస్తున్న బీజేపీ సెంట్రల్ జిల్లా మాజీ అధ్యక్షుడు డాక్టర్ గౌతమ్‌రావు



మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేస్తున్న వాకర్స్ క్లబ్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ గవర్నర్ లింగప్రకాష్, హైదరాబాద్ సిటిజన్ ఫోరం ప్రధాన కార్యదర్శి వీరయ్య



వినాయక విగ్రహం ఆగమన వేడుకలో గణేశ్ నగర్ యూత్ అసోసియేషన్ వారు



కాచిగూడ నింబోలిఅడ్డలోని మహాకాళి ఆలయం వద్ద ప్రతిష్టించే వినాయక మండపానికి ఆదివారం కర్రపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కన్నె ఉమాదేవి, బీజేపీ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేష్‌యాదవ్, మండపం నిర్వాహకులు కేసరి నర్సింగ్‌యాదవ్, సుభాష్‌పటేల్, సత్యంధర్ తదితరులు పాల్గొన్నారు. - బర్కత్‌పుర, ఆంధ్రజ్యోతి

1977(పీవోటీ) చట్టం రద్దు చేయాలి

- అసైన్డ్ భూములు కలిగిన వారికే వాటిపై సంపూర్ణ హక్కులు కల్పించాలి
- అసైన్డ్ ల్యాండ్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్



సమావేశంలో మాట్లాడుతున్న ఎర్రోళ్ల శివయ్య

రాంనగర్, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): 1977(పీవోటీ) చట్టం రద్దుచేయాలని, అసైన్డ్ భూములు కలిగిన వారికే ఆ భూములపై సంపూర్ణ హక్కులు కల్పించాలని తెలంగాణ అసైన్డ్ ల్యాండ్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎర్రోళ్ల శివయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ అసైన్డ్ ల్యాండ్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అసైన్డ్ భూముల్లో సమాన హక్కులను కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. తెలంగాణ రాష్ట్రంలో 20 లక్షల ఎకరాల అసైన్డ్ భూములు దాదాపు 16 లక్షల కుటుంబాలకు సంబంధించినవిగా ఉన్నాయన్నారు. పేదప్రజలకు పంపిణీచేసిన అసైన్డ్ భూములకు భద్రత కల్పిస్తామంటూ 1977లో ఆసైన్డ్ భూములు చట్టం చేశారన్నారు. తద్వారా అసైన్డ్ భూములు అమ్మరాదని, లీజుకు ఇవ్వరాదని, పేరు మార్పిడి చేయరాదని, ఎలాంటి కట్టడాలు, నిర్మాణాలు చేయరాదని నిబంధనలు తీసుకువచ్చారని వివరించారు. 1977 చట్టం వల్ల ఆసైన్డ్ భూముల పట్టా లను పొందిన ఓనర్స్ ఆ భూములపై హక్కులు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. నీటి ప్రాజెక్ట్ కోసం పేదరైతు నుంచి తీసుకున్న భూములకు నష్టపరిహారం చెల్లించాలన్నారు. కొందరు అసైన్డ్ భూములను కోల్పోవడం జరిగిందని, వాటిని తిరిగి భూయజమానులకు అప్పగించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు బింగి రాములు, సుదర్శన్‌బాబు, ఉప్పరి శ్రీనివాస్, శంకర్, విజయ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

పురాణపండ రచన 'నిను ప్రార్థన చేసెద' ఆవిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఆచార్య ఇనాక్, కళాజనార్దనమూర్తి, పాటిబండ్ల సత్యనారాయణ తదితరులు

చిక్కడపల్లి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): అఖండ దైవబలంతో నిస్వార్థ యజ్ఞభావనతో అసాధారణ ప్రతిభతో విమర్శలను కూడా ఘన విజయాలుగా మార్చుకోవడంలో ప్రముఖ రచయిత పురాణపండ శ్రీనివాస్ అకుంఠిత కృషి ప్రస్ఫుటంగా మన కనులముందు కనిపిస్తోందని వేంకటేశ్వరవిశ్వ విద్యాలయం పూర్వ వీసీ ఆచార్య కొలకలూరి ఇనాక్ అన్నారు. గణపతి నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని జ్ఞానసరస్వతి దేవాలయం సమర్పణలో ఆదివారం త్యాగరాయ గానసభలో జరిగిన ప్రముఖ రచయిత పురాణపండ శ్రీనివాస్ రచించిన 'నిను ప్రార్థన చేసెద' ఆవిష్కరణ సభ ఆదివారం త్యాగరాయగానసభ ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆచార్య కొలకలూరి ఇనాక్ మాట్లాడుతూ తాతతండ్రులను మించి ఆర్షసాహితికి పురాణపండ శ్రీనివాస్ చేస్తున్న ఆధ్యాత్మిక భావజాల సేవ అనన్యసామాన్యమైందని అభినందించారు. అధ్యక్షత వహించిన గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి మాట్లాడుతూ ఆధ్యాత్మిక సాహిత్య కవిత్వ రంగాల్లో అప్రతిహత జైత్రయాత్ర సాగిస్తున్న పురాణపండ శ్రీనివాస్ వెనుక ఉన్న దైవబలానికి ఆయన ప్రతిభ కారణమని చెప్పారు. జంట నగరాలే కాకుండా తెలంగాణలో ఎన్నో మఠాలలో పీఠాలలో ఆలయాలలో ధార్మిక మండళ్ళలో పురాణపండ శ్రీనివాస్ అపురూప గ్రంథాలు దర్శనమిస్తున్నాయని అన్నారు. ఈ ఉద్యమానికి ఊపిరిపోస్తున్న దేవాదాయశాఖ మంత్రులు ఆనం రామ రామనారాయణరెడ్డి, కొండా సురేఖ సీనియర్ ఐఏఎస్ అధికారులు కేవీ రమణాచారి, టి.కిషన్‌రావు, కిమ్స్ ఆస్పత్రి చైర్మన్ బొల్లినేని కృష్ణయ్య, వారాహి చలనచిత్ర అధినేత సాయి కొర్రపాటి, తెలంగాణ పూర్వ స్పీకర్ మధుసూదనాచారి, జేజే ఆస్పత్రి చైర్మన్ డా.జయంతిరెడ్డి తదితర ప్రముఖులకు జనార్దనమూర్తి కృతజ్ఞతలు తెలిపారు. తొలి ప్రతి స్వీకరించిన హైకోర్టు న్యాయమూర్తి మాట్లాడుతూ.. పాటిబండ్ల సత్యనారాయణ ప్రసాద్ ధార్మిక ఆధ్యాత్మిక చైతన్యానికి ప్రతీకగా ఈ మహాగణపతి గ్రంథం నిను ప్రార్థన చేసెద అని అభివర్ణించారు. గ్రంథ రచయిత పురాణపండ శ్రీనివాస్ మాట్లాడుతూ తిరుమల శ్రీవారి శ్రీకటాక్షంగానే ఈఅపూర్వ కదలికలన్నీ జరుగుతున్నాయని, తాను నిమిత్తమాత్రుడనని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేత ఎ.వినయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

భారత రాజ్యాంగాన్ని ప్రత్యేక పాఠ్యాంశాల్లో చేర్చాలి



ఇందిరాపార్కు వద్ద జరిగిన రాజ్యాంగ దీక్షలో పాల్గొన్న అంజన్న, కవి జయరాజ్, పలువురు నేతలు

కవాడిగూడ, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వం భారత రాజ్యాంగంపట్ల ప్రతి విద్యార్థి అవగాహన కలిగి ఉండేలా చర్యలు తీసుకోవాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. ఆదివారం జైభీమ్ మహాసేన, తెలంగాణ సామాజిక ప్రజాసంఘాలు, విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఇందిరాపార్కు వద్ద తెలంగాణ ప్రభుత్వం భారత రాజ్యాంగాన్ని ఆరో తరగతి నుంచి పదోతరగతి వరకు ప్రత్యేక సబ్జెక్టులుగా పాఠ్యాంశాలలో చేర్చాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు జై భీమ్ మహాసేన వ్యవస్థాపక అధ్యక్షుడు రాజ్యాంగం అంజన్న ఆధ్వర్యంలో భారత రాజ్యాంగ పాఠ్యాంశ దీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా జస్టిస్ చంద్రకుమార్, రిటైర్డ్ ఐఆర్‌టీఎస్ అధికారి డాక్టర్ ఎ.భరత్‌భూషణ్, కాంగ్రెస్ పార్టీ సంవిధాన్ బచావో కమిటీ చైర్మన్ డాక్టర్ వినయ్‌కుమార్, ప్రజాకవి జయరాజ్, మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు జి.చెన్నయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాజ్యాంగం అమలులోకి వచ్చి 75 సంవత్సరాలు గడస్తున్నప్పటికీ పాలకులు నేటి వరకు భారత రాజ్యాంగాన్ని పూర్తిస్థాయిలో అమలుచేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తరువాత రాజ్యాంగ వ్యవస్థలన్నింటినీ ధ్వంసం చేస్తోందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భారత రాజ్యాంగాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వీసీకే పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు జిలకిర శ్రీనివాస్, మూఢనమ్మకాల నిర్మూలన సమితి జాతీయ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ బైరి నరేష్, తెలంగాణ రాష్ట్ర కళామండలి అధ్యక్షుడు తెలంగాణ శ్యామ్, బహుజన రచయిత మత్స్య దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

143 డెకాయి ఆపరేషన్స్.. 70 మంది అరెస్ట్

- మహిళలు, పిల్లల భద్రతకు షీటీమ్స్ ప్రత్యేక చర్యలు
- మానవ అక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టి

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 24(ఆంధ్రజ్యోతి): మహిళలు, పిల్లల భద్రతకు షీటీమ్స్ బృందాలు ప్రత్యేకంగా పనిచేస్తున్నాయి. సైబరాబాద్ పరిధిలో డెకాయి ఆపరేషన్స్ చేపట్టి మహిళలు, పిల్లల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించడంతో పాటు వేధింపులకు గురిచేస్తున్న వారిపై దృష్టి సారిస్తున్నారు. గత వారం రోజుల వ్యవధిలో 143 డెకాయి ఆపరేషన్స్ నిర్వహించి అసభ్యకరమైన చర్యలకు పాల్పడుతున్న 70 మందిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకోవడంతో పాటు 47 కేసులు నమోదు చేశామని సైబరాబాద్ ఉమెన్ అండ్ చైల్డ్ సేఫ్టీ వింగ్ డీసీపీ సృజన కరణం ఓ ప్రకటనలో తెలిపారు. మహిళా బాధితుల నుంచి వచ్చిన ఫిర్యాదులను స్వీకరించి, వారికి న్యాయం చేసేలా షీ టీమ్స్ పనిచేస్తున్నాయని, వివిధ ప్రదేశాల్లో 75 అవగాహన కార్యక్రమాలు నిర్వహించామని ఆమె పేర్కొన్నారు. కమిషనరేట్ పరిధిలో భార్యాభర్తలకు సంబంధించి సుమారు 34 కుటుంబాలకు కౌన్సిలింగ్ ఇచ్చి, వారిని కలిపేందుకు ప్రయత్నాలు చేసినట్లు తెలిపారు. మానవ అక్రమ రవాణా, పిల్లల అక్రమ రవాణా, ఈవ్‌టీజింగ్, సోషల్ మీడియా వేధింపులు, బాల్య వివాహాలు, పిల్లలహక్కులు, బాలకార్మికులు, యాచించడం, సైబర్ బెదిరింపులు, సైబర్ మోసాలు తదితర అంశాలపై వారం రోజుల్లో పోలీసు సిబ్బంది క్షేత్రస్థాయిలో పర్యటించి అవగాహన కల్పించారని ఆమె వెల్లడించారు. మహిళా బాధితులు హెల్ప్‌లైన్ 181, పిల్లలకు సంబంధించిన సహాయం కోసం చైల్డ్ హెల్ప్ లైన్ 1098కు ఫోన్ చేయాలని సూచించారు.



నిందితులతో పాటు స్వాధీనం చేసుకున్న కొకైన్‌తో ఎక్సైజ్ ఎస్‌టీఎఫ్ బృందం

డ్రగ్స్ విక్రయాలపై ఎక్సైజ్ ఉక్కుపాదం

పలు ప్రాంతాల్లో దాడులు కొకైన్, ఎండీఎంఏ స్వాధీనం

హైదరాబాద్ సిటీ, ఆగస్టు 24 (ఆంధ్రజ్యోతి): గంజాయి, డ్రగ్స్ విక్రేతలపై వరుస దాడులు చేస్తున్న ఎక్సైజ్ అధికారులు నగరంలో మూడు వేర్వేరు ప్రాంతాల్లో కొకైన్, ఎండీఎంఏ విక్రయిస్తున్న మూడు ముఠాలను అరెస్ట్ చేశారు. నాంపల్లి రామ్‌కోట్ ప్రాంతానికి చెందిన మిస్బావుద్దీన్ ఖాన్(35), బంజారాహిల్స్‌కు చెందిన అలీ అస్గర్ గులాబీ (28)లు కొకైన్ తాగడానికి అలవాటు పడ్డారు. వీరు బెంగళూరుకు చెందిన మహ్మద్ అజీమ్ అనే వ్యక్తి నుంచి కొకైన్ కొని తాగేవారు. నగరంలో డ్రగ్స్ దొరకడం కష్టంగా మారడంతో వీరు బెంగళూరుకు వెళ్లి అజీమ్ నుంచి గ్రాము కొకైన్ రూ. 9వేలకు తెచ్చుకొని, నగరంలో పార్టీలు చేసుకునేవారు. బెంగళూరు వెళ్లి కొకైన్ తెచ్చుకునేందుకు నెల రోజుల క్రితం నగరానికి వచ్చిన అమెరికన్ సిటిజన్ జుబేర్ అలీ కారును తీసుకున్నారు. బెంగళూరు నుంచి కొకైన్ తీసుకొని నగరానికి వచ్చిన వీరి గురించి పక్కా సమాచారమందుకున్న ఎక్సైజ్ ఎస్‌టీఎఫ్ సిబ్బంది రామ్‌కోట్ ప్రాంతంలో వీరి కారును అడ్డుకున్నారు. మిస్బావుద్దీన్, అలీ అస్గర్, జుబేర్ అలీలను అరెస్ట్ చేసి వీరి నుంచి 33.3 గ్రాముల కొకైన్, 4 మొబైల్స్, ఇన్నోవా క్రిస్టా కారును స్వాధీనం చేసుకున్నారు.

ఖాజాగూడ, శంషాబాద్ ప్రాంతంలో ఎండీఎంఏ..

ఖాజాగూడ ప్రాంతంలో ఎండీఎంఏ విక్రయాలు జరుగుతున్నాయన్న సమాచారంతో ఎస్‌టీఎఫ్ సిబ్బంది నిఘా పెట్టారు. ఎండీఎంఏ విక్రయించేందుకు యత్నిస్తున్న నాగుల్ల శివపనవర్, దేవట్ల మనోజ్, శ్రీవర్ధన్‌ను అరెస్ట్ చేసి, వారి నుంచి 2.07 గ్రాముల ఎండీఎంఏ, రెండు యాక్టివా బైకులు, మూడు మొబైల్స్ స్వాధీనం చేసుకున్నారు. వీరికి సరఫరా చేసే అలీ పరారీలో ఉన్నాడని ఎక్సైజ్ అధికారులు తెలిపారు. మరోకేసులో శంషాబాద్ ప్రాంతంలో డ్రగ్స్ విక్రయాలపై నిఘాపెట్టిన ఎక్సైజ్ అధికారులు అనుమానాస్పదంగా సంచరిస్తున్న ఖయ్యూం నగర్‌కు చెందిన మిర్జాసైఫ్ అలీ, అత్తాపూర్‌కు చెందిన అబ్దుల్ అబిద్‌ను తనిఖీ చేశారు. వారి వద్ద 5.88 గ్రాముల ఎండీఎంఏ లభించడంతో వారిద్దరిని అరెస్ట్ చేశారు. మరో నిందితుడు సయ్యద్ అబ్దుల్ హసన్ పరారీలో ఉన్నట్లు తెలిపారు.